క్లుప్తంగా

వేంకటేశ్వరుని సేవలో ఎమ్మెల్యే దంపతులు



బలభద్రపురంలో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు శనివారం పాల్గొన్నారు. ఇటీవల ఎమ్మెల్యే దంపతులు తిరుపతి వెళ్ళి స్వామిని దర్శించుకున్నారు. అలాగే బలభద్రపురం ఆలయం ప్రతి శనివారం నిర్వహించే సేవా కార్యక్రమాన్ని వారి సొంత ఖర్చుతో ఏర్పాటు చేశారు. దీంట్లో భాగంగానే శనివారం సేవ కార్యక్రమం నిర్వహించి అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు.

గోదాదేవి కల్యాణం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం వద్ద అర్చకులు హర్షవర్ధన్, రాఘవరాం, వాడపల్లి గోపాలచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

నేడు కనకదుర్గమ్మ జాతర

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడి, గాదరాడ గ్రామాల్లోని కనకదుర్గమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ నాయకులు గణేశుల పోసి, బత్తిన త్రిమూర్తులు, తోరాట శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకూ పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మహోత్సవాలకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరవుతారని తెలిపారు. మధురపూడిలో రాత్రి బాణసంచా కాల్పులు ఏర్పాటు చేశారు.

అన్నసమారాధన

సీతానగరం: చినకొండేపూడిలోని అభయాంజేయస్వామి ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎల్‌విసీ రాజు ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం ఉదయం 11 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహించారు.

శాంతియుతంగా సంబరాలు చేసుకోవాలి

బిక్కవోలు: మండలంలోని ప్రజలంతా నూతన సంవత్సర సంబరాలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 సాయంత్రం మండలవ్యాప్తంగా ప్రధాన రహదారుల్లో ఎవరైనా అతిగా మద్యం తాగి వాహనాలు నడిపినా, మైనర్లు వాహనాలు నడిపినా, బహిరంగా ప్రదేశాల్లో కేక్ కట్ చేయడం వంటివి చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సీతానగరం: మండలంలోని కూనవరానికి చెందిన పీతల గంగరాజు (68) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజు శనివారం తెలిపారు. గంగారాజు ఆరు నెలలుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు పశువుల పాక వద్ద తన కుమారుడు కొలు పొలానికి కొట్టిన పురుగుల మందును తాగాడు. అతడిని వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం ఉదయం 11.40 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందాడు.

క్రీడలతో మంచి భవిష్యత్

పెదపూడి: క్రీడల ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందని జి.మామిడాడలోని డీఆర్‌కేరెడ్డి విద్యా సంస్థల అధినేత డీఆర్‌కే రెడ్డి అన్నారు. శనివారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో ఇంటర్ కాలేజీ మహిళల హ్యాండ్‌బాల్ పోటీల టోర్నమెంట్, ఎంపికలు ఆట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి డీఆర్‌కే రెడ్డి, ఆదికవి నన్నయ యూనివర్సిటీ సెక్రటరీ స్పోర్ట్స్ బోర్డ్ డాక్టర్ బి.గోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయపతాకాన్ని ఎగురవేశారు. డీఆర్‌కేరెడ్డి మాట్లాడుతూ పోటీలు రెండు రోజుల పాటు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక డిగ్రీ, పీఆర్‌జీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్లు టి.శ్రీనివాసరెడ్డి, వర్మ, ఫిజికల్ డైరెక్టర్లు బి.వెంకట్రావు, సురారెడ్డి, వెంకటరెడ్డి, సత్యనారాయణ, యువరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా

రాజానగరం: జాతీయ రహదారిపై జీఎస్‌ఎల్ వైద్య కళాశాల సమీపంలో శనివారం తెల్లవారుజామున లారీబోల్తా పడింది. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయ్యింది. నర్సీపట్నం నుంచి రాజమహేంద్రవరానికి కర్రల లోడుతో వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న కంటైనర్‌ని అధిగమించబోయి, అదుపు తప్పి తిరగబడింది. ఆ సమయంలో దట్టంగా పొగమంచు కమ్మేసి ఉండటంతో డ్రైవర్‌కి సరిగా కనిపించక ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. లారీ బోల్తా పడడంతో కర్రలన్నీ రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌నుక్రమబద్ధీకరించారు. ఈ ఘటనలో ఎవ్వరికీ ప్రమాదం జరగలేదు.

బడుగు వర్గాల ఆశాజ్యోతి పూలే

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డితో కలిసి పూలే విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ



జ్యోతీరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

అనపర్తి: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతీరావు పూలే అని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. వేమగిరి–సామర్లకోట కెనాల్ రోడ్డులో స్థానిక ఎర్రకాలువ వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన జ్యోతీరావ్ పూలే విగ్రహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డితో కలిసి ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ

భారత ప్రప్రథమ సామాజిక తత్వవేత్త జ్యోతీరావు పూలే అన్నారు. విద్యతోనే సమాజంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు వస్తుందని తద్వారా సమసమాజ స్థాపన సాధ్యపడుతుందన్నారు. పూలే ఆశయ స్ఫూర్తితో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతో రిజర్వేషన్లు ఏర్పడి ఎంతో మందికి న్యాయం చేకూరుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జనగణనను నిర్వహించినట్లే ప్రతీ పది సంవత్సరాలకొకసారి కుల గణనను నిర్వహిస్తే జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ సౌకర్యం, ప్రభుత్వ ఫలాలు అర్హులకు సక్రమంగా అందుతాయని అన్నారు. రాజమహేంద్రవరం క్వారీ సెంటర్‌లో పార్లమెంటు భవన నమూనాతో ఒక భవనాన్ని నిర్మించి అక్కడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నామని, జనవరి 26న దీనిని ప్రారంభించనున్నట్లు ఎంపీ వెల్లడించారు. అదేవిధంగా గోదావరి గట్టున ఉన్న పూలే విగ్రహానికి ఎదురుగా జ్యోతిరావ్‌పూలే, అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లు నిర్మిస్తున్నట్లు ఎంపీ తెలిపారు. సుమారు ఐదు అంతస్తులతో నిర్మించే ఈ భవనంలోని ఒక అంతుస్తులో బీసీ, ఎస్సీ విద్యార్థుల కోసం స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కుల, మత, వర్ణ వివక్షలు రూపుమాపేందుకు కంకణబద్ధుడై మొదటిసారిగా పోరాటం సలిపిన మహోన్నత వ్యక్తి పూలే అన్నారు. జాతిపిత గాంధీ కంటే ముందుగానే మహాత్మునిగా పూలే ప్రజల పూజలు అందుకున్నారన్నారని అన్నారు. అదేవిధంగా మహిళా విద్యాభివృద్ధితోనే మహిళా సాధికారిత సాధ్యమని, మహిళా విద్యా శ్రేయస్సు కోసం పూలే కృషిచేశారన్నారని కొనియాడారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, పలువురు ప్రముఖులు, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని సర్వేల్లోనూ వైఎస్సార్ సీపీదే హవా

- సంక్షేమ పథకాలే మన బలం
- విజయమే లక్ష్యంగా పనిచేయండి
- పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాబోయే ఎన్నికలో రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని స్థానిక ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఈ మేరకు వివిధ సంస్థలు చేసిన సర్వేలలో వైఎస్సార్ సీపీ హవా నడుస్తోందన్నారు. మండలంలోని నందరాడ, రామస్వామిపేట, పల్ల కడియం గ్రామాల్లో శనివారం నిర్వహించిన గ్రామ కమిటీల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని రీతిలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందని వారు రాష్ట్రంలో లేరన్నారు. ముఖ్యమంత్రి అమలు చేసిన సంక్షేమ పథకాలే మన బలమన్నారు. మన పార్టీ విజయమే లక్ష్యంగా అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులపై ముఖ్యనేతలతో చర్చించి, త్వరలోనే సరైన నిర్ణయం తీసుకుంటామన్నారు.

రెండు ఓహెచ్‌ఆర్‌ల ప్రారంభం

జలజీవన్ మిషన్ అమలులో భాగంగా పల్ల కడియంలో రూ.72 లక్షలతో నిర్మించిన రెండు ఓవర్ హెడ్ ట్యాంకులను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా లాంఛనంగా ప్రారంభించారు. చెరువు వద్ద 60 వేల లీటర్లు, ఎస్సీ పేటలో 40 వేల లీటర్ల వాటర్ స్టోరేజ్ సామర్థ్యంతో వీటిని నిర్మించారు. అలాగే రూ.12 లక్షలతో ఎస్సీ పేటలో నిర్మించిన డ్రైనేజీలను కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



నరేంద్రపురంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజా

మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

మహాత్ముల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని నరేంద్రపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 19 విజయవాడలో 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తమ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, నామినేటెడ్ పదవులలో ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్నారు. నియోజకవర్గంలో గోదావరి జలాలను తాగునీరుగా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చేనెల 28న ఇందుకు సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టనున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, సొసైటీ చైర్‌పర్సన్ పబ్బన శ్రీనివాస్, స్థానిక నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు
- నరేంద్రపురంలో అవగాహన కార్యక్రమం



చిరుధాన్యాలపై ప్రజలను చైతన్య పరుస్తూ నరేంద్రపురంలో నిర్వహిస్తున్న ర్యాలీ

రాజానగరం: రోజు వారీ ఆహారంలో చిరుధాన్యాలను ఒక భాగంగా చేసుకోవడం వల్ల మంచి ఆరోగ్యం పొందవచ్చని, రైతులు కూడా వీటి సాగుపై ఆసక్తి చూపాలని జిల్లా వ్యవసాయాధికారి కె.మాధవరావు అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని నరేంద్రపురం రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) వద్ద శనివారం రైతు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాలు - యాజమాన్యం - విలువ జోడింపు అనే అంశంపై ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం (రాజమహేంద్రవరం) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ చిరుధాన్యాలలో బి విటమిన్ ఎక్కువ శాతం, ఐరన్, కాల్షియం, మాంగనీస్, ఫాస్ఫరస్, పొటాషియం, మెగ్నీషియం, జింక్ మున్నగు ఖనిజాలన్నీ సమృద్ధిగా ఉంటాయన్నారు. మరే ధాన్యంలోనూ లేని విధంగా 100 గ్రాములు రాగుల నుంచి 344 మి.గ్రా. కాల్షియం లభిస్తుందన్నారు. జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ చిరుధాన్యాలు పండించే రైతులకు ప్రోత్సాహకంగా ఉచితంగా కొంతమేరకు విత్తనాలకు ఇన్‌పుట్స్ ఇవ్వగలమన్నారు. వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధీర్‌కుమార్ చిరుధాన్యాల సాగు, అనుసరించాల్సిన పద్ధతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఏడీఏ శ్రీనివాసులురెడ్డి, ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్, శాస్త్రవేత్త డాక్టర్ కె.అచ్యుత్‌రాజు మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రయోజనాలను, సాగు వలన వచ్చే లాభాలను వివరించారు. తొలుత చిరుధాన్యాలపై ప్రజలను చైతన్యపరుస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మునలయ్య, సొసైటీ చైర్‌పర్సన్ పబ్బన శ్రీనివాస్, ఆర్‌బీకేల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు గ్రేస్ సేవలు అభినందనీయం



టీచర్ గ్రేస్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సీతానగరం: స్థానిక వెలమపేటలోని ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయురాలు జి.వనీలా గ్రేస్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయుడు జీవీ పల్లయ్య గుప్తా ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో కె.స్వామి నాయక్ మాట్లాడుతూ 1998 నుంచి ఉపాధ్యాయురాలిగా వనీలా గ్రేస్ ఎన్నో సేవలు అందించారన్నారు. అనేక మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం గ్రేస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాటవరం ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు చిరంజీవి, వెంకటేష్, నాగమణి, నర్సవేణి, బేగం పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పేదల అభ్యున్నతి



పెదపూడిలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే పేదల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో 25 మంది లబ్ధిదారులకు శనివారం ఆయన ఇళ్ళ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో పేదల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తూ ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. పేదరికమే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న గొప్ప ముఖ్యమంత్రి జగన్ అన్నారు. జగన్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతుందన్నారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు మరిన్ని అమలవుతాయని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గా ప్రసాద్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పప్పు సింహాచలం, సామాజిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరా వీర్రాజు, కాకర సాయిబాబు, గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టైలర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం మంజూరు



స్థలం మంజూరుకు సంబంధించిన పత్రాలను సంఘం ప్రతినిధులకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: టైలర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి కేటాయించిన 58 గజాల స్థలానికి సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా అసోసియేషన్ ప్రతినిధులకు అందజేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఇచ్చిన మాటకు అనుగుణంగా అసోసియేషన్ కార్యకలాపాల నిర్వహణకు గాను స్థలాన్ని కేటాయించామన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ కొండేటి భీమేష్, కానూరి కృష్ణ, వివిధ టైలరింగ్ షాపుల యజమానులు, వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో పెరిగిన కొనుగోలు శక్తి



విలేకరులతో మాట్లాడుతున్న గురుదత్త ప్రసాద్, మండపాక శ్రీను

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు జరుపుతున్న సంక్షేమ పథకాలతో ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతోందని వైఎస్సార్ సీపీ నాయకులు మేడా గురుదత్త ప్రసాద్, మండపాక శ్రీను అన్నారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడుతూ అమ్మఒడి, విద్యా దీవెన, విద్యావసతి పథకాలతో రేపటి తరానికి మంచి భవిష్యత్తును చూపుతున్నారన్నారు. ఇల్లు లేని పేదలకు సొంతింటి స్థలం, పక్కా ఇల్లు కల్పించడంలో జగనే సాటిగా నిలిచారన్నారు. రైతు భరోసా ద్వారా సాగులో రైతన్నలకు అన్నివిధాలా అండగా ఉంటున్నారన్నారు. విత్తు నుంచి పంట విక్రయాలు వరకూ చేదోడుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇటీవల మునగాల గ్రామంలో జనసేన, టీడీపీ నుంచి పలువురు కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారన్నారు. అదే తరహాలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన చాలామంది వైఎస్సార్ సీపీలో చేరతారన్నారు.

సీఎం పర్యటనను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి

పెదపూడి: వచ్చే నెల 3న కాకినాడలో సీఎం జగన్ పర్యటనను అధికారులు జయప్రదం చేయాలని కాకినాడ డీఎల్‌డీఓ నారాయణమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, విలేజ్ ఆర్గనైజర్లకు ఎంపీడీఓ వీవీ సాయిబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక పింఛన్లు రూ.3000లకు పెంచుతూ కాకినాడలో లబిదారులకు ఆ పింఛను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, ఏఓ చలమయ్య, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, యాళ్ల ఉమా మహేశ్వరరావు, జి.త్రినాథ్, బి.ప్రసన్నకుమార్, అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు



ఈలకొలనులో నిందితుడితో సెబ్ అధికారులు, పోలీసులు

రంగంపేట: మండలంలోని ఈలకొలనులో సెబ్ అధికారుల ఆధ్వర్యంలో శనివారం సారా బట్టీలు, విక్రయాలు జరుపుతున్న వారి ఇళ్లపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. సారా బట్టీలను ధ్వంసం చేసి 105 లీటర్ల సారా, 1600 లీటర్ల బెల్లపు ఊట స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పాల్గొన్న సెబ్ సీఐ జి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఈలకొలను గ్రామంతో పాటు చుట్టుపక్కల తోటలు, పొలాల్లో తనిఖీలు నిర్వహించగా గ్రామానికి చెందిన గుత్తుల వీరబాబు నుంచి 1200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి 70 లీటర్ల సారా, తయారీకి ఉపయోగించే సామగ్రి స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. మర్రిపూడిలో నిర్వహించిన దాడుల్లో గ్రామానికి చెందిన అంచూరి సత్తిబాబు నుంచి 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిందితుల్ని అరెస్టు చేసి పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా ఇద్దరికీ 14 రోజులు రిమాండు విధించినట్టు తెలిపారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేష్ కుమార్

మధురపూడి: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేయాలని కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ అన్నారు. కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సచివాలయం సెక్రటరీలు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లకు ఓరియంటేషన్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ జనవరి నుంచి పింఛన్లను రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచారన్నారు. జనవరి 3వ తేదీన ముఖ్యమంత్రి పింఛన్లను ప్రారంభిస్తారన్నారు. జనవరి 28వ తేదీ వరకూ ఆసరా పథకాన్ని అందించాలని, ఫిబ్రవరి 5వ తేదీన చేయూత సంక్షేమ పథకం అందించాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ మహేశ్వర ప్రతాప్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



నాగేశ్వరరావుకు నియామక పత్రం అందిస్తున్న స్టాలిన్

సీతానగరం: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మిర్తిపాడుకు చెందిన డొక్కా నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసిరిపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు మిర్తిపాడులో జరిగిన మండల సమవేశానికి రాష్ట్ర కో కన్వీనర్ చిడిపి స్టాలిన్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్, 12వ వార్డు మెంబర్, పీఎంసీ చైర్మన్ డొక్కా నాగేశ్వరరావును మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా నియమించారు. మద్దాల సతీష్, నారే పోశియ్య, దొండపాటి నాగేశ్వరరావు, డొక్కా గిరిబాబు పాల్గొన్నారు.

చురుగ్గా ఇంటింటి సర్వే

సీతానగరం: కుష్ఠువ్యాధి నివారణలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య, డాక్టర్ ఎస్.రాజు ఆధ్వర్యంలో చురుకుగా జరుగుతోంది. ఇందులో భాగంగా శనివారం సీతానగరంలో ఏఎన్‌ఎంలు ఎస్‌కే సలీబాబీ, మున్నీషా బేగం సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి మచ్చలు ఉంటే పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కుష్ఠువ్యాధికి సంబంధించి లక్షణాలు, మచ్చలు ఉంటే వైద్యాధికారుల దృష్టిలో ఉంచుతామన్నారు. సర్వేలో ముగ్గురిని అనుమానితులుగా గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు జీవీ సత్యవతి, జ్యోతి కుమారి, ఎం.దేవి, ఎం.కుమారి పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

అనపర్తి: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) ఆధ్వర్యంలో రూపొందించిన 2024 డైరీ, క్యాలెండర్‌లను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్టీయూ ఆధ్వర్యంలో ముద్రించిన డైరీ, క్యాలెండర్‌లు ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ అనపర్తి మండల శాఖ అధ్యక్షుడు కొవ్వూరి పోలిరామారెడ్డి, ఆర్థిక కార్యదర్శి కొవ్వూరి రవి భాస్కరరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు తమలంపూడి ఈశ్వరరెడ్డి, వెలగల భామిరెడ్డి, ద్వారంపూడి సురేంద్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి అభిషేకాలు

పెదపూడి: మండలంలోని సంపర గ్రామంలో శనివారం ధనుర్మాసం సందర్భంగా కలియుగ వైకుంఠ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు ఖండవల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ఉదయం విశేష పూజలు చేశారు. అలాగే పంచామృతాభిషేకం, తులసి పూజ, గోదా అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

పీహెచ్‌డీ ప్రదానం



రజితకు పీహెచ్‌డీ అందజేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో సూరవరపు జయసాయి రజితకు వీసీ ఆచార్య కె.పద్మరాజు పీహెచ్‌డీ పట్టాను శనివారం అందజేశారు. 'ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి జిల్లాలలో ఉపాధి ఎంపిక పరిశ్రమలపై వాతావరణ మార్పు అనుకూలత ప్రభావం' అనే అంశం పై చేసిన పరిశోధనకుగాను ఆమెకు పీహెచ్‌డీ లభించింది. ఈ పరిశోధనకు చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం పర్యవేక్షణనిగా, ఆచార్య డి.సూర్య చంద్రరావు సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌గా వ్యవహరించారు. పలువురు అధ్యాపకులు ఆమెను అభినందించారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



వంగలపూడిలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న స్వామి నాయక్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయని ఎలక్ట్రోరల్ ఆఫీసర్, ఎంఈవో కె.స్వామి నాయక్ అన్నారు. ఆయన శనివారం హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావులతో కలిసి పది పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల వద్ద మౌలిక సదుపాయాలను పరిశీలించామన్నారు.